
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రైతులను వేధిస్తున్న యూరియా వ్యథలు తీరబోతున్నాయి. అన్నదాతలకు అవసరమైన యూరియాను అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కర్నూలు జిల్లాకు తక్షణం 6,102 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం స్పందించింది. యూరియా సరఫరాకు చర్యలు చేపట్టింది. శుక్రవారం కర్నూలు, ఆదోని రైల్వే స్టేషన్ గూడ్ షెడ్లకు ఆయా కంపెనీల యూరియా 2,203 మెట్రిక్ టన్నులు చేరింది. అక్కడి నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ గోదాములకు, ప్రైవేటు వ్యాపారులకు సరఫరా చేశారు. మిగిలిన కోటా కూడా రెండు మూడు రోజుల్లో వస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. అయితే.. యూరియా పక్కదారి పట్టకుండా విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టారు. ప్రతి బస్తా రైతు ఇంటికే చేరేలా చర్యలు తీసుకుంటున్నారు.



కర్నూలు రైల్వే స్టేషన్ గూడ్ షెడ్ నుంచి యూరియా సరఫరా

యూరియా వచ్చేసింది..!


- రైతులకు తీరనున్న కష్టాలు
- జిల్లాకు 6,102 మెట్రిక్ టన్నులు కేటాయింపు
- కర్నూలు, ఆదోనికి చేరుకున్న 2,203 మెట్రిక్ టన్నులు
- యూరియా సరఫరాపై విజిలెన్స్ నిఘా

కర్నూలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 4,22,540 హెక్టార్లు. ఈ ఏడాది 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 3,38,488 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. అందులో ధాన్యపు పంటలు 14,900 హెక్టార్లు, పప్పు దినుసులు 39,147 హెకార్లు, నూనె గింజలు (ఆయిల్ సీడ్స్) పంటలు 37,157 హెకార్లు, పత్తి 2,17,430 హెక్టార్లు, మిరప 5,538 హెక్టార్లు, ఉల్లి 10,797 హెక్టార్లు, వరి 6,668 హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్ మొత్తానికి ఏప్రిల్ నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు యూరియా 51,275 మెట్రిక్ టన్నులు, డీఏపీ 19,035 టన్నులు, పోటాష్ 1,485 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1,04,840 టన్నులు, ఎస్ఎస్‌పీ 1,587 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏ నెలలో ఏ ఎరువు ఎంత అవసరం ఉందో ప్రణాళికను ప్రభుత్వానికి పంపించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 10-15 శాతం యూరియా సరఫరా తగ్గించింది. ఆ స్థానంలో నానో యూరియాను ప్రోత్సహించింది. అయితే గుళికల యూరియాకు అలవాటి పడిన రైతులు నానో యూరియాపై మొగ్గు చూపకపోవడం, యూరియా సరఫరాలో లోపాలు ఉండటంతో అన్నదాతకు కష్టాలు మొదలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అసరమైన మేరకు యూరియా సరఫరాకు చర్యలు తీసుకుంది.

జిల్లాకు చేరిన యూరియా

ఖరీఫ్ సీజన్ మొత్తానికి 51,275 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 24,991 టన్నుల యూరియా ఏపీ మార్క్‌ఫెడ్, ప్రైవేటు వ్యాపారుల ద్వారా అందజేశారు. 1,244 టన్నులు ప్రస్తుతం నిల్వ ఉంది. సెప్టెంబరు నెలలో 6,102 మెట్రిక్ టన్నుల యూరియా కావాలంటూ జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. స్పిక్ కంపెనీ యూరియా 904 మెట్రిక్ టన్నులు, ఐపీఎల్ కంపెనీ 2,600 మెట్రిక్ టన్నులు, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (సీఐఎల్) 2,598 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు కేటాయించారు. శుక్రవారం కర్నూలు రైల్వే స్టేషన్ గూడ్స్‌షెడ్‌కు స్పిక్ యూరియా 904 టన్నులు వచ్చింది. అందులో 70 శాతం ఏపీ మార్క్‌ఫెడ్‌కు, 30 శాతం డీలర్లకు సరఫరా చేశారు. ఆదోని రైల్వే గూడ్‌షెడ్‌కు సీఐఎల్ కంపెనీ యూరి 1,299 టన్నులు వచ్చింది. అందులో 55 శాతం ఏపీ మార్క్‌ఫెడ్‌కు, 20 శాతం మన గ్రోమోర్ కేంద్రాలకు, 25 శాతం ప్రైవేటు డీలర్లకు సరఫరా చేశారు. మిగిలిన యూరియా త్వరలోనే వస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

మిగతా 8వ పేజీలో



ఎంపీడీవోలుగా పదోన్నతి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జడ్పీ పరిధిలో పనిచేస్తున్న నలుగురు పరిపాలన అధికారులు, ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బేతంచెర్ల, పాములపాడు, బనగానపల్లె మండల కార్యాలయాల్లో పరిపాలన అధికారులుగా పనిచేస్తున్న పి.దస్తగిరిబాబు, ఎం.గాయత్రి, ఎస్.నాగరాజును నంద్యాల జిల్లాకు కేటాయించారు. కర్నూలు డ్వామాలో పనిచేస్తున్న ఏవో టి.క్రిష్ణ మోహన్‌ను కర్నూలు జిల్లాకు కేటాయించారు. ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు పి.నాగేంద్రుడు, వై.రామకృష్ణవేణికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించి నంద్యాల జిల్లాకు కేటాయించారు.

పదోన్నతుల ఫైల్ సిద్ధం

- త్వరలో డిజిటల్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు



జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయం

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోపు డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు లభించనున్నాయి. ప్రస్తుతం పీఆర్ శాఖలో పదోన్నతుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల 120 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4 గా పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం వారితో ఖాళీ అయిన స్థానాలను పదోన్నతి ద్వారా డిజిటల్ అసిస్టెంట్లకు కేటాయించనున్నారు. ఈమేరకు అధికారులు పదోన్నతుల ఫైల్‌ను సిద్ధం చేశారు. జీవో.నెం.65 ప్రకారం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతి పొందేందుకు 50 శాతం డైరెక్టు రిక్రూట్‌మెంటు ద్వారా మిగతా 50 శాతం డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలని ఆదేశాలు ఉన్నాయి. ఈనెలలోనే దాదాపు 40మంది గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-3గా పదోన్నతి కల్పించ నున్నారు. అక్టోబరు 31 నాటికి అన్నిస్థాయిల్లో పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం. గ్రామ పంచాయతీలకు జనాభా, ఆదాయం వారిగా వర్గీకరించనున్నారు.



టమోట పంట

టమోటా కిలో రూ.4

- పత్తికొండ మార్కెట్‌లో భారీగా పతనమైన ధర
- అన్నదాతకు తీవ్ర నష్టం

దేవనకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.4 పలికింది. ఈనెల 4న 25 కేజీల టామోటా బాక్సు రూ.350 పలుకగా.. శుక్రవారం రూ.250 తగ్గి రూ.100 పలికింది. కూలీ, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో టమోటా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పైగా వర్షాలతో కాయలపై మచ్చలు, చెట్టుపైనే ఎర్రపండు కుళ్లిపోతోంది. రైతులు పంట సంరక్షణ కోసం అవస్థలు తప్పడం లేదు. అధిక వర్షాలకు టమోటా పంట దిగుబడి తగ్గిపోవడంతో రైతులకు పెట్టుబడుల భారంతో అప్పుల తిప్పలు తప్పడం లేదు. మచ్చల నివారణ కోసం ఐదు సార్లకు పైగానే పురుగుల మందులను పిచికారీ చేయాల్సి వస్తోందని అన్నదాతలు చెబుతున్నారు. మండలంలో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా బోర బావుల కింద, వర్షాధారం కింద టమోట పంటను సాగు చేశారు.

రూ.400 నష్టం కలిగింది



ఎకరాన్నర పొలంలో టమోటా సాగు చేశా. లద్దె పురుగు, పచ్చదోమ నివారణకు, కాయకు మచ్చ తెగుళ్ల సోకకుండా ఎనిమిది సార్లు స్ప్రే చేశా. నాలుగుసార్లు భూసారం కోసం భూమిలో నాలుగుసార్లు మందు విత్తాను. రూ.30 వేల వరకు ఖర్చు పెట్టాను. మొదటి కోతకు 20 బాక్సులు దిగుబడి వచ్చింది. పత్తికొండ మార్కెట్‌కు పంట దిగుబడిని తరలిస్తే బాక్సు (25 కిలోలు) రూ.100 పలికింది. ఆరుగురితో పంట కోత కోశాను. వారికి రూ.1,800 ఖర్చు అయింది. ఆటో బాడుగ రూ.600. దీంతో రూ.400 నష్టం కలిగింది.

- నాగరాజు రైతు, దేవనకొండ

నేటి నుంచి 'పల్లెకు పోదాం' : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు శనివారం నుంచి నిర్వహించే 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని విజ యవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్పెషల్ ఆఫీసర్స్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో 'పల్లెకు పోదాం', స్వచ్ఛాంధ్ర అవార్డులకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలను బాగు చేయాలన్న సత్సంకల్పంతో 'పల్లెకు పోదాం'కు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇందు కోసం 79 మంది జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించా మని, జిల్లాలో ప్రతి మండలంలో 3 గ్రామాల చొప్పున 79 గ్రామాలను ఎంపిక చేశామని, 79మంది అధికారులు 79 గ్రామాలకు సందర్శిస్తారని చెప్పారు. స్వచ్ఛాంధ్ర అవార్డులకు సంబంధించి అన్ని శాఖలు సమాచారాన్ని 9వ తేదీలోపు పంపాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీపీవో భాస్కర్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో 26 మంది వ్యాపారుల సస్పెన్షన్

ఉత్తర్వులు జారీచేసిన యార్డు చైర్‌పర్సన్

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో 26 మంది ఉల్లి వ్యాపారులను చైర్‌పర్సన్ గోల్కొండ అజ్మిత్‌బీ సస్పెండ్ చేశారు. కర్నూలు మార్కెట్‌యార్డులో ఇంత మంది వ్యాపారులను సస్పెండ్ చేయడం యార్డు చరిత్రలో ఇదే మొదటి సారి. ఇటీవల కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లిని అమ్మకానికి తెచ్చిన రైతుల నుంచి వెలువెత్తిన ఫిర్యాదులను మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీతతో పాటు కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు పరిశీలించారు. వారి ఆదే శాలపై శుక్రవారం చైర్‌పర్సన్ అజ్మిత్‌బీ 26 మంది ఉల్లి వ్యాపారులను సస్పెండ్ చేస్తూ ఉత్త ర్వులు జారీ చేసినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. లైసెన్సులు తీసుకున్న ఉల్లి వ్యాపారులు రైతుల నుంచి ఉల్లి కొనుగోలు జర పాలని ఇటీవల ఎన్నోసార్లు నోటీసులు జారీ చేశారు. వారిలో ఎటువంటి స్పందన రాకపోవ డంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉల్లి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాజాభివృద్ధిలో టీచర్ల పాత్ర కీలకం

- రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి
- కలెక్టర్ రంజిత్ బాషా
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవార్డులు



కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన గురు పూజోత్సవంలో కలెక్టర్‌తో పాటు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువులను పూజించే సంప్రదాయం అనాదిగా వస్తుందని, ఈ సంప్రదాయం తరతరాలకు వర్ధిల్లాలని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బడిఈడి పిల్లలందరికీ బడుల్లోనే చేర్పించాలనే అంశంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే ముందుందన్నారు. గత సంవత్సరం 5.15లక్షల మంది విద్యార్థులు బడిలో ఉండగా ఈఏడాది 5.22లక్షల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఆన్‌లైన్ తరగతులు సద్వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, ఇన్‌చార్జి ఆర్ఐవో జి.లాలెప్ప, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పార్వతి, రాష్ట్ర బొందిలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్‌సింగ్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులు, మార్గదర్శకులు అని కొనియాడారు. మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేది ఉపాధ్యాయులే అని ఎమ్మెల్యే ప్రశంసించారు.

ఉపాధ్యాయులది ఎనలేని కృషి

విద్యార్థులను తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయులు ఎనలేని కృషి చేస్తున్నారని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ప్రతి పాఠశాలకు రెండు కంప్యూటర్లు ఏర్పాటు

ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి కర్నూలు పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలకు రెండు కంప్యూటర్లు ఏర్పాటు చేస్తామని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నామని, ఉపాధ్యాయులు ఇచ్చిన స్ఫూర్తి, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యతో తాను 45 సంవత్సరాలకే ఎంపీ స్థాయికి ఎదిగానని అన్నారు. డీఎస్సీలో జిల్లాకు రాష్ట్రంలోనే అత్యధికంగా 2,667 పోస్టులను భర్తీ చేశారన్నారు.



ఉపాధ్యాయుడికి అవార్డు అందజేసి సత్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే,కలెక్టర్



యువతకు ఆదర్శం.. సురవరం

- సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ

7




ఘనంగా ముగిసిన గణేశ్ నిమజ్జనోత్సవం

- శుక్రవారం మధ్యాహ్నం వరకు కొనసాగిన నిమజ్జనం
- భరతమాత గణనాథుడికి తుది వీడ్కోలు


కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో తొమ్మిది రోజులుగా కన్నుల పండువగా సాగిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఉదయం 11:30 గంటలకు చివరి విగ్రహం నిమజ్జనంతో వైభవంగా ముగిశాయి. నగర నడిబొడ్డున గల కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూకాలనీలో గల భరత మాత గుడి (విశ్వ హిందూ పరిషత్ కార్యాలయం ఆవరణ)లోని విఘ్ననాయకుడి విగ్రహాన్ని చివరగా ఉత్సవ ప్రతినిధులు నిమజ్జనం చేశారు. అనంతరం హర్షాతిరేకాల మధ్య గణేశ్ నిమజ్జనోత్సవం పూర్తయినట్లు ప్రకటించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గణేశ్ మంటపాలలో రెండు వేలకు పైగా విగ్రహాలు నెలకొల్పగా, వాటిని నిర్వాహకులు గురువారం రోజున ఆలస్యంగా తరలించారు. వినాయక ఘాట్‌లోనూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన విగ్రహాల నిమజ్జన ప్రారంభం ఆలస్యంగానే మొదలైంది. దీంతో శుక్రవారం ఉదయం వరకు భారీ విగ్రహాలను కేసీలో నిమజ్జనం చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, బి. వేణుగోపాల్, గోరంట్ల రమణ, ఎస్. రంగ స్వామి, మాళిగి భానుప్రకాశ్, టి. ప్రతాపరెడ్డి, అక్కెం విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల సమష్టి సహకారంతో నిమజ్జనోత్సవం విజయవంతంగా పూర్తయిందని, వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. పోలీసు అధికారుల ముందస్తు బందోబస్తు చర్యలతో శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు కొనసాగాయని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా భక్తులు సంతోషంగా ఈ నిమజ్జనోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.







నగరంలో భరతమాత గుడిలో నెలకొల్పిన గణేశ్ విగ్రహాన్ని చివరిగా నిమజ్జనం చేస్తున్న ఉత్సవ సమితి ప్రతినిధులు



ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన వ్యక్తి సర్వేపల్లి

- ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్నట్లు వీసీ

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వన్నె తెచ్చిన మహనీయులు అని ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్లు సుందరానంద పుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీలో..

డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్. మహబూబ్ బాషా, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పాల్ కృపాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్ఎస్ఎం హుస్సేనీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీమఠానికి విరాళంగా కారు

- రూ.34 లక్షలు విలువ చేసే వాహనాన్ని అప్పగించిన ఎస్‌బీఐ అధికారులు



కారును విరాళంగా ఇస్తున్న ఎస్‌బీఐ అధికారులు

మంత్రాలయం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఎస్‌బీఐ తరఫున రూ.34 లక్షలు విలువ చేసే ఇన్నోవా కారును విరాళం అందజేశారు. ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఆదేశాల మేరకు శుక్రవారం మఠం ముఖద్వారం ముందు ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పాటిల్, జనరల్ మేనేజర్ అశోక్ కుమార్, సుమన్, డీజీఎం హేమ ఆధ్వర్యంలో రూ.34 లక్షల విలువ చేసే ఇన్నోవా కారును పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులుతో పూజ చేయించి శ్రీమఠానికి అప్పగించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, మంత్రాలయం బ్రాంచ్ మేనేజర్ రాజ్‌కుమార్ సమక్షంలో జెండా ఊపి రిబ్బన్ కట్ చేసి కారును శ్రీమఠానికి అందించారు. కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఏఈ బద్రీనాథ్, డిప్యూటీ మేనేజర్లు రామచంద్ర నాయక్, నరేంద్ర, మహేష్, ప్రసాద్, ఉరుకుందమ్మ, రవి, సర్దార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

200 గదుల నిర్మాణానికి భూమి పూజ

- పాల్గొన్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు



భూమి పూజలో పాల్గొన్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు, పీఠాధిపతి తదితరులు

మంత్రాలయం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని సుయతీంద్రతీర్థుల 200 వసతి గృహంపైన 3, 4 అంతస్థుల్లో మరో 200 గదులు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నడాఫ్, జస్టిస్ ఉమాదేవి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజా ఎస్.గిరిరాజాచార్, తెలంగాణ పశువైద్యశాఖ జాయింట్ సెక్రటరీ అమ్రెన్ కుమార్‌తో కలిసి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భూమి పూజ చేశారు. మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, ఈఈ సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్ ఆధ్వర్యంలో శాంతి పూజలు చేసి ప్రారంభించారు. పీఠాధిపతి మాట్లాడుతూ భక్తులు ఇచ్చిన రూ.12 కోట్లతో మూడో అంతస్థులో 100 గదులు, నాలుగో అంతస్థులో 100 గదులు నిర్మించనట్లు తెలిపారు. ఈ 200 గదులను వచ్చే రాఘవేంద్రస్వామి ఉత్సవల నాటికి అందుబాటులోకి తెచ్చేలా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. మరో 100 గదుల నిర్మాణానికి భక్తుల నుంచి దాతల నుంచి విరాళాలు వచ్చాయని, త్వరలో భూమి పూజకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మఠం ఏఈ హరిదాస్, సీఆర్వో ఎ.బద్రీనాథ్, రామాంజినేయులు, జోన్ రాఘవేంద్రాచార్, కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించండి

- మందులు బయటకు రాయవద్దు
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- జీజీహెచ్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కాలేజీల అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో పార్కింగ్ స్థలాలను గుర్తించినా ఎందుకు ఇంకా వాటిని అమలు చేయలేదని, సూపర్ స్పెషలిస్టు బ్లాక్‌లో ఆపరేషన్ థియేటర్ పనులు ఆలస్యమవుతున్నాయని, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లపై మండిపడ్డారు. ఈనెల 30వ తేదీలోపు వెహికల్ పార్కింగ్, అక్టోబరు 15లోపల ట్రాలీ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లను ఆదేశించారు. సమీక్షకు ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ ఉన్నతాధికారులు ఎందుకు రాలేదని మంత్రి ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు మందులు బయటకు రాయవద్దని డాక్టర్లను ఆదేశించాలని సూపరింటెండెంట్‌ను మంత్రి కోరారు. ఐరన్ స్క్రాప్, జంగిల్ క్లియరెన్స్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్త సిటీ స్కాన్‌ను పీపీపీ మెయింటెనెన్స్ కింద ఇవ్వాలని 135 సీసీ టీవీ కెమెరాలకు అదనంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు 3వేల మంది అవుట్ పేషెంట్లు రావడం జరుగుతుందని, పందుల సమస్య ఉందని హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమీక్షలో కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ కే.కృష్ణ ప్రకాష్, సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, డీఎంహెచ్‌వో డా.భాస్కర్, డీసీహెచ్ఎస్ డా.జెఫరుల్లా, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డా.భాస్కర్‌రెడ్డి, హెచ్‌డీఎస్ సభ్యులు ప్రదీప్, పద్మజ, ప్రవీణ్ పాల్గొన్నారు.

దొంగతనాలపై ఫిర్యాదు

ఆసుపత్రిలో ప్రతిరోజు రోగుల ఫోన్లు, పార్కింగ్‌లో పెట్టిన బైక్‌లు, ఆటోలు చోరీలకు గురవుతున్నాయని, హాస్పిటల్ హెచ్‌డీఎస్ సభ్యుడు సాయిప్రదీప్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో కుక్కలు, పందుల బెడద విపరీతంగా ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. శానిటేషన్ ఏజెన్సీతో సూపరింటెండెంట్ మాట్లాడి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. కాలేజీ, హాస్పిటల్, హాస్టల్‌లో ఉన్న కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయించి బయటకు వదలాలని, కర్నూలు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.విశ్వేశ్వరరెడ్డిని మంత్రి ఆదేశించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో సమీక్ష మళ్లీ నిర్వహిస్తానని, ప్రతి 15 రోజులకు ఒకసారి హాస్పిటల్, మెడికల్ కాలేజీ అధికారులు, హెచ్‌డీఎస్ సభ్యులతో కలిసి కూర్చుని సమస్యలపై చర్చించుకుని తన దృష్టికి తీసుకురావాలని మంత్రి తెలిపారు. జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ హాస్పిటల్‌కు రూ.80వేల విలువైన పది స్ట్రెచ్చర్లను, విరాళంగా ఇచ్చారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో 'జగదేక సుందరి సామా'కు ప్రశంసలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారుల 'జగదేక సుందరి సామా' చారిత్రక పద్య నాటకం ప్రేక్షకుల ప్రశంసలు అదుకుంది. శుక్రవారం అనంతపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో ఐదు రోజుల పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. అనంతపురంలోని శ్రీసత్యసాయి నాటకోత్సవ సమితి, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ నాటకోత్సవాలు అనంతరపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం డీఆర్వో మలోల, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దివాకర్‌రావు, దక్షిణ భారత సాంస్కృతిక మండలి మాజీ సభ్యుడు షైఖేల్‌బాబు, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తొలిరోజు నాటకాలను ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా డీఆర్వో మలోల మాట్లాడుతూ... ప్రఖ్యాతి గాంచిన చింతామణి నాటకాన్ని మైమరపించేలా 'సామా' ఉందని కొనియాడారు. రాష్ట్రస్థాయిలో ఈ ప్రదర్శనలు నిరంతరం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈనెల 9 వరకు ఈ నాటకోత్సవాలు కొనసాగుతాయని, అదేరోజు సాయంత్రం బహుమతి ప్రదానం ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఫోన్ ద్వారా తెలియజేశారు.



నాటక ప్రదర్శన అనంతరం కళాకారులను అభినందిస్తున్న అనంతపురం డీఆర్వో మలోల

శాంతి మార్గంలో నడవాలి

- మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్
- ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



మిలాద్ కమిటీ ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, ఎస్వీ మోహన్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వైసీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుక 'మిలాద్-ఉన్-నబీ'ని ముస్లింలు ఘనంగా ఘనంగా నిర్వహించుకున్నారు. నగరంలోని సెంట్రల్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో పాతనగరంలోని లావుబాలీ దర్గా నుంచి రాజ్‌విహార్ వరకు వేలాది మంది ముస్లింలు భారీ ఊరేగింపు నిర్వహించారు. రాజ్ విహార్ సెంటర్‌లో కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. మిలాద్ కమిటీ వ్యవస్థాపకుడు అహ్లె సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు సయ్యద్‌షా షఫీపాషా ఖాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సభలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటూ పలువురు ముస్లిం మతపెద్దలు హాజరయ్యారు. హైదరాబాదుకు చెందిన నక్షిబంద్ మౌలానా ప్రధాన వక్తగా విచ్చేసి ప్రసంగించారు.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందిం చారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంత పురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాలలో తెలుగులో నిర్వహించ నున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్ర మానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

అసత్య ప్రచారాలు చేస్తే కఠినచర్యలు

- యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు
- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత ఉందని అసత్య ప్రచారాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రంజిత్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ యంత్రాంగం ఎప్పటికప్పుడు ఎంత యూరియా జిల్లాకు సరఫరా అవుతుందని, రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్, డీలర్ల వద్ద ఎంత అందుబాటులో ఉందో రైతులకు తెలిసేలా ప్రకటనలు జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో యూరియా పంపిణీకి సంబంధించి ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలోని వివిధ సంస్థల్లో 1,329 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మొత్తం 6,104 టన్నుల యూరియా జిల్లాలోని రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కౌతాళం, హోళగుంద, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు, కోసిగి, ఆలూరు,పత్తికొండ, సి.బెళగల్ మండల వ్యవసాయ అధికారులతో ఇటీవల మాట్లాడామని, ఈ మండలాల్లోనే సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. సక్రమంగా రైతులకు యూరియా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నానో యూరియా వాడాలని రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మిని ఆదేశించారు.

ప్రగతిశీల కవులకు మార్క్సిజమే మూలవస్తువు



జంధ్యాల రఘుబాబు పుస్తకాలు పరిచయం చేస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల కవులకు మార్క్సిజమే మూలవస్తువు అని ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సాహితీ స్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు రాసిన పుస్తకాలపై సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. రఘుబాబు రాసిన ఐదు పుస్తకాలను ఆవిష్కర్త జి.వెంకటకృష్ణ పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘుబాబు కవిత్వం, కథ, పాట, విమర్శ రాయడం అరుదైన విషయమని చెప్పారు. రఘుబాబు తన రచనలు మార్క్సిజం దృష్టికోణంలో రాయడం గొప్ప విషయమని అన్నారు. ఆర్‌యూ తెలుగుశాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ అరుణ మాట్లాడుతూ సున్నితమైన అంశాలను తన కథల్లో గాఢమైన వస్తువుగా మార్చి పాఠకులను జంధ్యాల ఆకట్టుకుంటున్నారని ప్రశంసిం చారు. విరసం నాయకుడు డాక్టర్ నాగేశ్వరాచారి మాట్లాడుతూ సీమ అస్తిత్వాన్ని ప్రతిపాదించే కవిత్వం జంధ్యాల గొప్పగా రాస్తున్నారని, అందుకు ఆయన రచనలు ఉదాహరణంగా నిలిచిపోతాయని అన్నారు. సభాధ్యక్షత వహించిన స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ విమర్శనాత్మక రచనల్లో కలాన్ని పదునైన ఆయుధంగా ఉపయోగించి సమగ్ర స్వరూపంగా అందించే ఘనత జంధ్యాలకు దక్కుతుందని అన్నారు. చివరగా జంధ్యాల రఘుబాబు తన స్పందన తెలియజేస్తూ లోతైన సాహిత్య అధ్యయనమే మంచి రచయితను తీర్చిదిద్దుతుందని, ఆదిశగా సాగిస్తున్న ప్రయత్నాల్లోంచి రాసిన పుస్తకాలే ఇవి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్రవంతి ప్రతినిధి నాగమణి, ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, మధు బాలగౌని తదితరులు పాల్గొన్నారు.

అవార్డు బాధ్యతను పెంచింది

- ఉత్తమ ఉపాధ్యాయురాలు వినూత
- చంద్రబాబు నుంచి సత్కారం



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు వినూత

పత్తికొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవడం మరింత బాధ్యతను పెంచినట్లయిందని హోసూరు ఎంపీపీ (డబ్ల్యూ) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వినూత వెల్లడించారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. సీఎం చంద్రబాబు వినూతను అవార్డు, జ్ఞాపిక, నగదు ప్రోత్సాహం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వినూత 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ముఖ్యమంత్రి చేతులమీదుగా అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాధారణ పేద కుటుంబంలో పుట్టిన తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన తల్లిదండ్రులు, విద్యార్థుల తల్లిదండ్రులే కారణమన్నారు. పేదరికంలో ఉన్న ఇబ్బందులు తనకు బాగాతెలుసని అందుకే చదువుకు దూరమయ్యే విద్యార్థులకు అండగా నిలుస్తూ వారిని మంచి విద్యావకాశాల వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

● గేర్ రాడ్డుకు బోల్టులు ఊడిపోవడంతో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు



వెంకటగిరి సమీపంలో పొలంలోకి దూసుకెళ్లిన బస్సు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి సమీపంలో ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. వివరాలివీ.. డోన్ డిపోకు చెందిన బస్సు శుక్రవారం ఉదయం కోడుమూరు నుంచి 21 మంది ప్రయాణికులతో వెల్దుర్తికి బయల్దేరింది. అయితే మార్గమధ్యంలో గేర్ రాడ్డుకు బోల్టులు ఊడిపోవడంతో నియంత్రణ తప్పి రోడ్డుపక్కన పొలంలోకి దూసుకెళ్లింది. అయితే ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వ్యక్తిపై దాడి: ఏడుగురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కొలిమిగుండ్ల బోయ రవికుమార్ అనే వ్యక్తిపై దాడి ఘటనలో ఇదే గ్రామానికి చెందిన ఏడుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. వివరాలు.. ఈనెల 2వ తేదీన కొలిమిగుండ్లకు చెందిన బోయ వెంకటేష్ మరో ఆరుగురు కలిసి, పాత కక్షలు మనసులో పెట్టుకొని రవికుమార్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పవర్‌గ్రిడ్ కేబుల్ అపహరణ

సంజామల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథ కొండ సమీపంలో జరుగుతున్న పవర్‌గ్రిడ్ పనుల్లో శుక్రవారం 850కిలోల కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. పవర్‌గ్రిడ్ సీనియర్ మేనేజర్ సతీష్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పిచ్చికుక్క దాడి

● మహిళకు తీవ్ర గాయాలు



పత్తికొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పత్తికొండలో చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం మదిరి గ్రామానికి చెందిన మహిళ పనినిమిత్తం శుక్రవారం పత్తికొండకు వచ్చింది. పని ముగించుకుని అంబేడ్కర్ కూడలి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుంది. అంతలోనే ఆమెపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో కాలికి తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణంలో గతంలో కొందరు చిన్నారులు కూడా కుక్కల దాడికి గురయ్యారు.

రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు

● ఇన్‌చార్జి సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన గోవింద్



బాధ్యతలు తీసుకుంటున్న గోవింద్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్‌కు తమ పంట ఉత్పత్తులను విక్రయానికి వచ్చే రైతులకు లాభదాయకమైన ధరను అందించేందుకు, అలాగే ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని సెలక్షన్ గ్రేడ్ ఇన్‌చార్జి కార్యదర్శి కె.గోవింద్ అన్నారు. శుక్రవారం ఆయన ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గోవింద్ మాట్లాడుతూ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, రైతులు హమాలీలను సమన్వయం చేసుకొని సజావుగా పంట ఉత్పత్తులకు విక్రయవిక్రయాలు జరిగేలా చూస్తామన్నారు. గ్రేడింగ్‌పై రైతులకు వ్యాపారులకు నష్టం కలగకుండా కొనుగోలు జరుపుతామన్నారు. సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అనంతపురంలో పనిచేస్తూ ఇక్కడికి ఇన్‌చార్జి సెక్రటరీగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వేరుశనగ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు మర్యాదపూర్వకం కలిశారు. సహాయ కార్యదర్శి శాంత కుమార్, సూపర్వైజరులు, రాము, నాగరాజు, అశోక్ ఉన్నారు.

2న 'స్వచ్ఛాంధ్ర' అవార్డుల ప్రదానం

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2వ తేదీన మహాత్మా గాంధీ జయంతి రోజున స్వచ్ఛాంధ్ర అవార్డులను ప్రదానం చేయనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ గవర్నమెంటు ఆఫీసులు, స్వచ ఎన్జీవోస్, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్స్ సంబంధించి ఎంపీడీవోల ద్వారా ఈ నెల 8వ తేదీలోపు నామినేషన్లను ఆన్‌లైన్ ద్వారా డీపీవో కార్యాలయానికి పంపించాలని తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి రిమాండ్

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తి గ్రామంలో తండ్రిని హత్య చేసిన కేసులో కొడుకును అరెస్టు చేసినట్లు సీఐ తబ్రేజ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన రామాచారిని కొడుకు వీరసాయి రోకలితో కొట్టి హత్య చేసినట్లు తెలిపారు. రామాచారి భార్య వీరుపాక్షమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆస్తి ఇవ్వలేదని తండ్రి ముఖం, తలపై రోకలితో కొట్టి చంపినట్లు తెలిపారు. వీరసాయిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

పాములపాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనకచెర్ల పవర్‌హౌస్ వద్ద కేసీ కెనాల్‌లో మహిళ మృతదేహం లభ్యమైంది. వివరాలివీ.. కర్నూలు మండలం పూడూరు గ్రామానికి చెందిన మాధవి(24) గతనెల 31న గ్రామ శివారులోని కేసీ కెనాల్‌లో దుస్తులు ఉతికేందుకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆమె తండ్రి బోరెల్లి కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. బంధువులు గత మూడు రోజులుగా కేసీ కెనాల్ వెంట గాలిస్తుండగా పాములపాడు మండలంలో మృతదేహం లభ్యమైంది. కర్నూలు పోలీసులకు సమాచారం అందించడంతో తాలుకా స్టేషన్ ఎస్ఐ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కర్నూలుకు తరలించారు. ఈ కేసును పూర్తిస్థాయిలో విచారిస్తామని పోలీసులు తెలిపారు.

కేసీ కాలువలో...

కర్నూలు క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసీ కెనాల్‌లో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. గణేశ్ నగర్ సమీపంలో శివాలయం వద్ద ఓ యువతి మృతదేహం కొట్టుకుపోతుండగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మహిళా మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. అలాగే గ్రీన్ పార్కు సమీపంలో కేసీ కెనాల్‌లో ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకుపోతుండగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మృతదేహా న్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమ్మ కాలనీకి చెందిన చాకలి జ్వాలా నరసింహుడు(45) అనే కౌలు రైతు చికిత్స పొందతూ మృతి చెందారు. నరసింహుడు గత ఏడాది 10 ఎకరాలు కౌలుకు తీసుకొని మినుము సాగు చేశారు. ఈ ఏడాది ఐదెకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశారు. కొన్నేళ్లుగా సాగు కోసం రూ.20 లక్షలు అప్పు చేశారు. అయితే ఆ అప్పు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో రైతు తన ఇంట్లో గురువారం రసాయన మందు తాగారు. ఆయను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. నరసింహుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

యువతకు ఆదర్శం.. సురవరం

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
● ఉద్యమాలతో ఎంతో ఎదిగారు : రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
● పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా : సీపీఎం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్
● సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యువతకు ఆదర్శం సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. శుక్రవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డితో కలిసి ఉద్యమంలో పనిచేయడమే కాకుండా తన కుటుంబానికి బంధుత్వం సైతం ఉందన్నారు. రాజకీయాల్లో స్పష్టమైన వైఖరితో ఉండే సుధాకర్‌రెడ్డి అందరినీ కలుపుకుపోయే గుణం ఉదన్నారు. ఇలాంటి మహనీయుల జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలు యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పి.రామచంద్రయ్య అన్నారు. విద్యార్థి ఉద్యమాలతో పాటు జిల్లాలోని మలగవెల్లిలో భూపోరాటం చేసి సుమారు 1100 ఎకరాలు పేదలకు పంపిణీ చేయడంలో సుధాకర్‌రెడ్డి కీలక పాత్ర అన్నారు. అనంతరం సురవరం మిత్రులు రామచంద్రారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురవరం గీతామాధురి, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ.సుబ్బారెడ్డి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, భీమలింగప్ప, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కే.రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, లెనిన్‌బాబు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

సురవరం గొప్పనేత : టీజీ వెంకటేశ్

సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప నేత అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. పార్టీలు, సిద్ధాంత పరమైన విభేదాలున్నా వ్యక్తిగత జీవితంలో ఎంతో ప్రేమగా ఉండేవారని అన్నారు. నగరం నుంచి ఉద్యమాలు ప్రారంభించి చివరకు జాతీయ స్థాయిలో పార్టీకి ప్రధాన కార్యదర్శిగా పని చేశారన్నారు. అలాంటి వ్యక్తికి కర్నూలు నగరంలో ఆయన పేరు నిలిచిపోయేలా చేపట్టే ఎలాంటి కార్యక్రమానికైనా తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

పేదల పక్షాన నిలిచిన.. : ఎంఏ గఫూర్

పేద పక్షాలన నిలిచిన వామపక్ష యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఎం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. ధనిక కుటుంబంలో పుట్టినా పేదల పక్షాన పోరాటం చేశారని కొనియాడారు. నిత్యం పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండి పోరాటం చేశారన్నారు. చిరునవ్వుతో అందరిని పలకరించడం సురవరం సుధాకర్‌రెడ్డి, సీతారాం ఏచూరికి సొంతమన్నారు.

రూ.30కోట్లతో ఉడాయించాడు..

వారణాసిలో దొరికాడు..!

● బంగారు వ్యాపారిని పట్టుకొచ్చిన బాధితులు
● టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగింత
● విచారణ చేపట్టిన పోలీసులు




టూటౌన్‌కు చేరుకున్న బాధితులు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ బంగారు వ్యాపారి రూ.30కోట్లతో ఉడాయించాడు. వారణాసిలో ఉన్నాడన్న సమాచారంతో బాధితులు అతడిని నంద్యాలకు తీసుకువచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు..పట్టణంలోని సుంకులమ్మ వీధికి చెందిన శివ (శివ జువెలర్స్ యజమాని) చాలా మంది వద్ద బంగారు ఆభరణాలు చేయిస్తానని డబ్బులు తీసుకొని పది నెలల క్రితం ఉడాయించాడు. బాధితులు విచారణ చేపట్టగా అతడు వారణాసిలో ఉన్నాడని సమాచారం అందించింది. ఈ మేరకు కొంత మంది అక్కడికి వెళ్లి శుక్రవారం అతడిని నంద్యాలకు తీసుకువచ్చారు. గతంలో కూడా శివ మీద రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. దీంతో అతడిని అక్కడ అప్పగించారు. చీటీలు, బంగారు ఆభరణాలు చేయిస్తానని చాలా మంది వద్ద డబ్బులు తీసుకున్నాడు. పదేళ్ల నుంచి దుకాణం నడుపుతుండడంతో బాధితులు నమ్మి డబ్బులు ఇచ్చారు. శివ టూటౌన్‌లో ఉన్నాడని తెలుసుకున్న బాధితులు అక్కడికి చేరుకుని అతనిపై ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఒక బంగారు దుకాణం యజమానికి కూడా కేజీ బంగారం వరకు లావాదేవీల్లో ఇవ్వాలని ఉన్నట్లు సమాచారం. ఇలా చాలా మంది బంగారు దుకాణాల వ్యాపారులను సైతం మోసం చేసినట్లు తెలిసింది. వారంతా వన్‌టౌన్ పోలీసు స్టేష న్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. బాధితులు నుంచి ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారూ.. ఆన్‌లైన్‌లో ఎక్కించరూ..

● ఉన్నతాధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదు
● ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతు



బాధిత రైతు గంటా రామస్వామిరెడ్డి

పాములపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సారూ.. తన సొంత పట్టాభూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటూ ఓ రైతు కొన్ని నెలలుగా మొర పెట్టుకుంటున్నాడు. అతడి మొరను ఆలకించే తీరిక మండల అధికారులకు లేనట్లు కనిపిస్తోంది. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత రైతు గంటా స్వామిరెడ్డి ఆరోపించారు. వివరాలు.. మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన గంటా స్వామిరెడ్డి 2010లో అదే గ్రామానికి చెందిన గాండ్ల సుబ్బమ్మకు చెందని సర్వే నెంబర్ 322 బై సీలో 0.52 సెంట్లను కొనుగోలు చేశాడు. ఆ పొలం ఆన్‌లైన్‌లో హరిజన వాడకు చెందిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలుగా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈవిషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేయాలని ఆర్డీవో ను ఆదేశించారు. వేంపెంట గ్రామంలో హరిజనవాడ గృహలకు 322 బై ఎలో 2.18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని, ఈ 52 సెంట్లు రైతు స్వామిరెడ్డి మిగులుభూమి అని జాయింట్ కలెక్టర్‌కు నివేదికలు పంపించారు. అన్ని పత్రాలు పరిశీలించిన జేసీ మ్యుటేషన్ చేయించుకోవాల్సిందిగా సూచించారు. దీని కోసం 70 రోజులుగా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తన పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఆదేశించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఆన్‌లైన్‌లో ఎక్కిస్తామన్నా సహకరించడం లేదు

వేంపెంట గ్రామానికి చెందిన స్వామిరెడ్డి చెందిన 52 సెంట్లలో 6 సెంట్లలో స్థూపం ఉందని, మరో మూడు సెంట్లు వేరే వ్యక్తికి, రైతు విక్రయించాడని అవి పోగా 43 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నాం. అయితే 46 సెంట్ల మిగులు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. తమ రికార్డుల ప్రకారం నడుచుకుంటామని చెప్పా. అయినా సహకరించడం లేదు.

- సుభద్రమ్మ, తహసీల్దార్, పాములపాడు

పట్టుపడ్డ ఎరువులు నకిలీవే..

ఆదోని రూరల్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పెద్దతుంబళంలో నబీ ఎరువుల దుకాణంలో ఈ ఏడాది జూలై 3వ తేదీన పట్టుపడ్డ స్పిక్ డీఏపీ ఎరువులు నకిలీవేనని ల్యాబ్ నిర్ధారణలో తేలిందని ఏవో సుధాకర్ తెలిపారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నబీ ట్రేడర్స్ యజమాని ఇలియాస్‌పై పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్‌లో నాణ్యత ప్రమాణాలు లేనందున ఫిర్యాదు చేయగా ఎస్ఐ మహేష్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దుకాణ దారుడు కర్నాటక నుంచి నకిలీ స్పిక్ డీఏపీని దిగుమతి చేసుకొని రైతులకు అంటగట్టాడని సంబంధిత కంపెనీ సిబ్బంది ఫిర్యాదు మేరకు దుకాణంపై దాడులు నిర్వహించామని ఏవో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణాన్ని సీజ్ చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబు సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. అందులో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి పది మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు అవార్డులను అందుకున్నారు. వారికి సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లు జ్ఞాపికలు, మెమొంటో, నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

-కర్నూలు/నంద్యాల (ఆంధ్రజ్యోతి)



గోపాలాచార్యులు, ఉపాధ్యాయులు, బురాన్‌దొడ్డి



డాక్టర్ బి.అనూష, సిల్వర్ జూబ్లీ కళాశాల, కర్నూలు



పి.వెంకట సుబ్బయ్య, నూనెపల్లి హైస్కూల్, నంద్యాల



సీతాపతి, జడ్పీ హైస్కూల్, బలపనూరు



వి.లక్ష్మయ్య, జడ్పీ హైస్కూల్, చాగలమర్రి



షేక్ మగ్బూల్ బాషా, హెచ్ఎం, కె.బనకచర్ల పాఠశాల



సంతోష్ కుమార్, జూనియర్ లెక్చరర్, కౌతాళం



సైద్ బాబు, జూనియర్ లెక్చరర్, పాణ్యం



సాయినాథ్ రెడ్డి, లెక్చరర్, నంద్యాల పాలిటెక్నిక్



డాక్టర్ పరిమళ దేవి, డిగ్రీ లెక్చరర్, నందికొట్కూరు

గుప్త నిధుల కోసం వేట

● ధణాపురం పాడుపడ్డ బావిలో తవ్వకాలు
● 12మంది అరెస్టు ● పరారీలో పలువురు



బావిని పరిశీలిస్తున్న ఆదోని రూరల్ సీఐ

ఆదోని రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఢణాపురంలో గుప్త నిధుల కోసం వేట కొనసాగింది. గ్రామంలోని సర్వే నెంబర్: 107ఏలో పాడుపడ్డ దిగుబడు బావిలో తవ్వకాలు చేపట్టారు. పోలీసులు ఆదోని మండలంలో లేనప్పుడు తవ్వకాలు ప్రారంభించాలని మాజీ సర్పంచ్ మరి కొందరితో కలిసి పథకం రచించాడు. ఈ మేరకు గణపతి నిమజ్జనం రోజు తవ్వకాలు చేపట్టాలనుకున్నారు. కానీ 10 రోజులుగా మండలంలో వర్షాలు వస్తుండడంతో వీరి పథకం నీరుగారిపోయింది. అయితే కర్నూలులో గురువారం వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తుకు కర్నూలుకు వచ్చారు. వారు తిరిగి వచ్చే లోపు పని పూర్తిచేయాలని అనుకున్నారు. సుమారు పది నుంచి 15మంది దాకా గురువారం రాత్రి ప్రణాళిక వేసి గుప్తనిధులు తవ్వకాల కోసం క్షుద్ర పూజలు చేశారు. మరో అరగంటలో వారి పని పూర్తయ్యేది. ఇంతలోనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వన్‌టౌన్ సీఐ శ్రీరాములు సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు. 12మందిని అదుపులోకి తీసుకోగా మరి కొందరు పరారయ్యారు.

పాత నేరగాళ్లు ఎక్కువ

గుప్త నిధులు తవ్వకాలు చేపడుతూ చిక్కిన 12మందిలో దాదాపు అందరూ పాత నేరగాళ్లే అని పోలీసులు చెబుతున్నారు. గతంలో వీరు చాలా ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తూ, గుప్త నిధులు తవ్వుతూ పట్టుపడి కటకటాల పాలైనట్లు తెలిసింది.

రౌడీషీట్ ఓపెన్ చేస్తాం

ఢణాపురంలో గుప్త నిధుల తవ్వకాలు చేపడుతుండగా 12మందిని అదుపులోకి తీసుకున్నాం. మరికొందరు పరారీలో ఉన్నారు. నిందితులందరిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తాం.

● నల్లప్ప, సీఐ, ఆదోని

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆలూరుకు చెందిన అక్బర్(35) శుక్రవారం మృతిచెందాడు. మరో ఇద్దరు గాయాలతో గుంతకల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా... అసిఫ్, అక్బర్ కలసి పని నిమిత్తం ఆలూరుకు వెళ్లి ద్విచక్రవాహనంలో బయల్దేరారు. దౌల్తాపురం నుంచి చిప్పగిరికి ద్విచక్రవాహనంపై వస్తున్న ఇబ్రహీం అదుపు తప్పి ఢీకొనడంతో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. అందులో అక్బర్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్బర్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎంపిక



జి.బాబురావు



ఆనందరావు

కర్నూలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా జిల్లాలో ఇద్దరు టీడీపీ నాయకులకు అవకాశం కల్పించారు. శుక్రవారం కూటమి ప్రభుత్వం మరో మూడు కార్పొరేషన్ల డైరెక్టర్లను నియమించింది. ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కర్నూలు నగరానికి చెందిన దర్వాడ ఆనందరావుకు అవకాశం కల్పించారు. 15 ఏళ్లుగా టీడీపీలో ఉంటూ మంత్రి టీజీ భరత్‌కు సన్నిహితుడిగా ఉంటున్నాడు. మంత్రి టీజీ సిఫార్సు మేరకు అవకాశం దక్కింది. మంత్రాలయం నియోజకవర్గం నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు, సీనియర్ న్యాయవాది జి.బాబురావుకు అవకాశం ఇచ్చారు. పెద్దకడుబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన ఈయన 20 ఏళ్లుగా పార్టీలో ఉన్నారు. మంత్రాలయం లీగల్ సెల్ ఇన్‌చార్జిగా కూడా పని చేశారు. వైసీపీ హయాంలో గ్రామ సర్పంచుగా పోటీ చేశారు.

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి


మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా దేశానికి చేసిన సేవలు మరువలేనివని టీడీపీ ఎస్సీ సెల్ నగర ఉపాధ్యక్షుడు ఏసన్న అన్నారు. శుక్రవారం నగరంలోని నర్సింగరావు పేట సర్కిల్‌లో మదర్ థెరిస్సా వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏసన్న మాట్లాడుతూ మిషనరీ ఆఫ్ చారిటీస్ అనే సంస్థను స్థాపించి అనాథలు, రోగులు, వృద్ధులు, కుష్టు రోగులకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో 46వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి నరసింహులు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు భాస్కర్ రావు, ప్రకాష్, నతనేయేలు, దేవరాజ్, చంద్ర శేఖర్, పరమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కర్నూలు మండలం పసుపుల గ్రామంలో ఎమ్మెల్యే తన నివాసంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఏమైన సమస్యలను ఉంటే తన దృష్టికి తీసుకవస్తే దశల వారీగా పరిష్కరిస్తానని అన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకరావాలని ఆయన కోరారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే దస్త గిరి అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న నిర్మల

గూడూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నిర్మల పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ప్రాజెక్టు కమిటీ మహాసభ నిర్వహించారు. నిర్మల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోగా పని భారం పెంచిందని మండిపడ్డారు. అలాగే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఐసీడీఎస్‌కు నిధులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. దేశ సంపదను అంబానీ, ఆదానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గఫూర్‌మియా, మోహన్, అనంతమ్మ, సుజాత, రత్నమ్మ, సూలమ్మ పాల్గొన్నారు.

13న నర్సెస్ అసోసియేషన్ సమావేశం


మాట్లాడుతున్న లీలావతి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్న మెంటు నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా సర్వసభ్య సమా వేశం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈ నెల 13వ తేదీ నిర్వహి స్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి, కోశాధికారి ఎన్.లక్ష్మిసరస్వతి వెల్లడించారు. శుక్రవారం కర్నూలు జీజీహెచ్‌లో వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రాధమ్మ, ఎస్.కోటమ్మ హాజరవుతారని, సమావేశం హాస్పటల్‌లోని ఓల్డ్ సీఎల్‌జీలో జరుగుతుందన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి: సీపీఎం


మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ఓర్వకల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీలో భూములు కోల్పోయి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి నాగన్న అధ్యక్షత వహించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఏపీఐఐసీ పేరుతో వేల ఎకరాల భూములు పరిశ్రమ కోసం తీసుకున్నారని, అయితే భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, రామకృష్ణ, అన్నయ్య, కృష్ణుడు, మద్దిలేటి పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు



కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు వి.కరుణానిధిమూర్తి, నాయకులు భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కరుణానిధిమూర్తి, మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ధనుం జయ, నాయకులు రవిప్రకాష్, మద్దిలేటి, నాగేంద్ర కుమార్, సుదర్శన్ బాబు, వీరారెడ్డి, మణికుమార్ పాల్గొన్నారు.

● రజక విద్యాసేవా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో స్కందాన్షి బిజినెస్ పార్కులో గల రజక విద్యాసేవా సమితి ప్రధాన కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న 9 మంది రజక ఉపాధ్యా యులను సన్మానించారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సీపీ వెంకటేశ్, నరసింహులు, బండారు లింగమయ్య, మాళంగిరి గణేష్, బాపనపల్లి రాధమ్మ, సి.రేణుకమ్మ, సీనియర్ జర్నలిస్టు మద్దూరు వెంకట్, న్యాయవాదులు జగదీష్, వెంకటేశ్వర్లు, సభ్యులు సిద్ద నగేష్, వీరశేఖర్ పాల్గొన్నారు.

● ఎ.క్యాంపులో షైఫర్ ఫార్మసీ కళాశాలలో టీచర్స్ డేను ఘనంగా నిర్వహించారు. షైఫర్ విద్యాసంస్థల ఫౌండర్ డా.ఆది మూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వేపల్లి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అధ్యాపకులను సన్మానించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ ఎం.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్, డీజే స్రవంతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యకరమంలో అధ్యాపకులు మల్లికార్జున, రామకృష్ణ, విజయశేఖర్, లక్ష్మి, సుజాత, గిరిజారాణి, చిన్న మల్లేశ్వరుడు, ఉల్లోజీరావు, శ్రీధర్, లావణ్య, శ్రావణి, జసింత, బాల శంకర్ పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: గురువులే భావిపౌరులను తీర్చిదిద్దే మార్గ దర్శకులని ఏపీ మానవ హక్కుల అసోసియేషన్స్ చైర్మన్ దేవరశెట్టి పరమేశ్వరయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని సెంట్రల్ ప్లాజాలో గల ఆయన కార్యాల యంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. తొలుత సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పరమేశ్వరయ్య మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహనీ యుడని కొనియాడారు. భారత రాష్ట్రపతిగా, ఉప రాష్ట్రపతిగా, బనారస్, ఆంధ్ర విశ్వ విద్యాలయాలకు ఉప కులపతిగా విశిష్ట సేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో రోజా మహిళా ఐక్యసంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత, సుబ్బరాయుడు, ఫణీంద్ర, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దేవరశెట్టి పరమేశ్వరయ్య

అధ్యాపకులకు సర్వేపల్లి స్ఫూర్తి ప్రదాత


బీఈడీ కళాశాలలో..

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ అధ్యాపకులకు స్ఫూర్తి ప్రదాత అని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత విద్య అధ్యయన సంస్థ బీఈడీ కళాశాలలో సర్వేపల్లి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మాణం అవుతుందని చెప్పిన రాధాకృష్ణన్ మాటలు అధ్యాపకులకు అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పార్వతి, నాగలక్ష్మి, లక్ష్మీకాంతాచారీ, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

సి.బెళగల్: ఉపాధ్యాయులు దిక్సూచి వంటివారని ట్రిపుల్‌ఐటీ నీట్ అకాడమీ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం సి.బెళగల్‌లోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ చింతలయ్య అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణ కలిగి ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈసందర్భంగా రామసుబ్బారెడ్డిని అధ్యా పకులు, ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ప్రదీప్, శ్రీనివాసులు, పీడీ రఘు పాల్గొన్నారు.


సి.బెళగల్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో..

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి : గౌరు చరిత


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన పాలక మండలి చైర్మన్, సభ్యులు ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని పూడిచెర్ల గ్రామంలో వెలసిన రామలింగేశ్వర, వీరభద్ర, చెన్నకేశవ, ఆంజనేయ స్వామి నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. చైర్మన్‌గా చిన్న నారాయణ, సభ్యులుగా వెంకట లక్ష్మమ్మ, మల్లేశ్వరి, మంగలి ఎల్లమ్మ, సంజీవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఇందిరమ్మ, చాకలి పెద్దమ్మ, ప్రవీణ్‌రావులను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు ఎమ్మెల్యేకి మేళాతాళాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పూడిచెర్ల గ్రామంలో పురాతన దేవాలయాలు ఉన్నాయని పాలక మండలి సభ్యులు వాటి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. త్వరలో జరిగే సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ఘన విజయంతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ రఘురాం, ఈవో మద్దిలేటి, టీడీపీ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, నాగముని, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, కల్లెం తిరుపాలు, శివుడు, ప్రకాశం,పాణ్యం తిరుపాలు, రాజన్న, వెంకటపతి, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

సి.బెళగల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో సైబర్ నేరాల నివారణపై ప్రజలకు ఎస్ఐ పరమేష్‌నాయక్ శుక్రవారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లో వచ్చే మేసేజ్‌లను నమ్మి మోస పోవద్దన్నారు. యువత మద్యానికి బానిస కాకుండా జాగ్రత్త పడాలన్నారు. అలాగే బహిరంగా ప్రదేశాలలో మద్యం, పేకాట, పొగత్రాడం వంటి చేస్తే జరిమానా తప్పదని ఆయన హెచ్చరించారు.

రేపు సామూహిక వ్రతాలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పూజల్లో పాల్గొనే భక్తులు ఆలయంలో తమ నామ గోత్రాలు తెలియజేసి, పూజలకు తగిన రుసుం చెల్లించి రసీదు పొందాలన్నారు. హరిహర క్షేత్రంలో ఆ రోజు భోజనాలు ఉండవని, స్వామివారి తీర్థ ప్రసాదాలు, పంచామృతం వితరణ చేస్తారని తెలిపారు. అదేరోజున సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నందున మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయం మూసి వేస్తారని తెలిపారు. గ్రహణం అనంతరం ఆలయ సంప్రోక్షణ తర్వాత సోమవారం ఉదయం పూజలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

వర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మనోహర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 3,480 మంది అధ్యాపకుల పోస్టులతోపాటు నాన్ టీచింగ్ పోస్టులను కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వివిధ శాఖల్లో పీహెచ్‌డీ సీట్లు పెంచాలని, పరిశోధన విద్యను మెరుగు పరచాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

సి.బెళగల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, పోలకల్లు, సంగాల, కంబదహాల్ తదితర గ్రామాల్లో మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు మిలాద్ ఉన్ నబీని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి, ఉస్మాన్, హరోన్, గౌస్, ఎస్‌ఎం బాషా, వలి పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘం
అధ్యక్షుల ఎంపిక

ఓర్వకల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సహకార పరపతి సంఘం సొసైటీ అధ్యక్షులను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు శుక్రవారం హుశేనాపురం సీఈవో మాలిక్ బాషా తెలిపారు. హుశేనాపురం సొసైటీ అధ్యక్షుడిగా పాలకొలను గ్రామానికి చెందిన సీఎన్ సుధాకర్ రెడ్డి, సభ్యులుగా సోమ యాజులపల్లెకు చెందిన సంజీవ, హుశేనాపురానికి చెందిన ఎస్.మాలిక్ బాషా ఎంపికయ్యారు. ఓర్వకల్లు సొసైటీ అధ్యక్షుడిగా కన్నమడకల గ్రామా నికి చెందిన సి.సుధాకర్‌రావు, సభ్యులుగా ఓర్వకల్లుకు చెందిన చెన్నూరు భాస్కర్ రెడ్డి, బ్రాహ్మణపల్లెకు చెందిన కమ్మ రాజశేఖర్, నన్నూరు సొసైటీ అధ్యక్షుడిగా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బి.నాగేశ్వరరెడ్డి, సభ్యులుగా ఉప్పలపాడుకు చెందిన రామాంజినమ్మ, నన్నూరుకు చెందిన సి.విక్రమ్ ఎంపికయ్యారు. త్వరలోనే సొసైటీ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చైర్మన్లు తెలిపారు.


సుధాకర్ రెడ్డి
సుధాకర్ రావు
నాగేశ్వరరెడ్డి

సావిత్రీబాయి పూలే జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంజీవయ్య జిల్లా సాధన సమితి కార్యదర్శి దాసరి రామ సేసయ్య, కన్వీనర్ జేవీ కృష్ణయ్య, గౌరవ సలహాదారు దామోదరం రాధాకృష్ణమూర్తి, సభ్యులు నాగభూషణం, సీవీ వర్మ, పాండు, మల్లికార్జున పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకొలను గ్రామంలో శనివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చదువుల సుజాతమ్మ, టీడీపీ సీనియర్ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కర్నూలు అమీలియో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నావన్నారు. ఈ శిబిరంలో కంటి శుక్లం, గుండె జబ్బులు, గర్భిణులకు షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులు, చెవి, ముక్కు వంటి సమస్యలపై వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

అమెరికా సుంకాల పెంపుపై నేడు నిరసన

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అమెరికా టారీఫల (సుంకాలు) పెంపునకు నిరసనగా శనివారం నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంపు విధిస్తున్న టారీఫ్‌లకు వ్యతిరేకంగా అన్ని పట్టణ మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలంతా పాల్గొనాలని వారు పిలుపుని చ్చారు. ఏపీలో ఆక్వా రైతులకు ట్రంప్ విధించిన టారీఫ్‌లతో చాలా నష్టం జరుగుతుందని వివరించారు. అయినా కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితి తగ్గించడం, జరి మానాలు విధించడంతో ఎన్నో ఆశల తో ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడ కూలిపోతున్నాయని అన్నారు.

వినాయ ఘాట్ వద్ద సెన్‌జాన్ అంబులెన్స్ సేవలు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్ఞ నాన్ని పురస్కరించుకుని నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద గత రెండు రోజులుగా కర్నూలు సెన్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ విశేష సేవలు అందించారు. రెండు రోజులుగా సెన్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మహేంద్ర కుమార్ ఆధ్వర్యంలో వినాయక ఘాట్ వద్ద ఉచిత శిబిరం, ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలు అందించారు. సెన్ జాన్ అంబులెన్స్ సంస్థ ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా రాష్ట్రంలో 34 సంవత్సరాలుగా ప్రథమ చికిత్స కేంద్రాలు, ఉచిత వైద్య శిబిరంలో ఇద్దరు వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్ విశేష సేవలు అందించినట్లు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సెన్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డా.మహేంద్ర కుమార్ తెలిపారు.

యూరియా వచ్చేసింది..!

5వ పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా యూరియాలో 70 శాతం వరకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ఇస్తుంది. అక్కడి నుంచి గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘాలు (పీఏసీఎస్)కు సరఫరా చేస్తుంది. సొసైటీలకు ఇస్తున్న యూరియా మెజార్టీగా రాజకీయ పలుకుబడి కలిగిన బడా రైతుల ఇళ్లకే చేరుతుండడంతో సామాన్య రైతులకు అందని ద్రాక్షగా మారింది. దీనికి తోడు గ్రామ రాజకీయాలు కూడా యూరియా సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. సొసైటీల్లో యూరియా లభించని రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. డీలర్లకు 30-40 శాతానికి మించి యూరియా ఇవ్వడం లేదు. దీనికి తోడు యూరియా కావాలంటే బయో ఎరువులు కొనాలని లింక్ పెడుతుండటం, కొందరు వ్యాపారులు ధనాపేక్షతో యూరియా కృత్రిమ కొరత సృష్టించడంతో రైతులు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిని పసిగట్టిన కూటమి ప్రభుత్వం విజిలెన్స్ నిఘా పెట్టడంతో యూరియా వ్యథలు రైతులకు తప్పాయని అంటున్నారు. ముఖ్యంగా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్ సొసైటీలకు సరఫరా చేస్తున్న యూరియా రైతుకు ఎంత సరఫరా చేశారో పక్కాగా నిఘా పెడితే యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఉండదు.


2,299 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది

2025-26లో ఖరీఫ్ సీజన్‌లో యూరియా ఇలా

వివరాలు	మెట్రిక్ టన్నులు
కావాల్సిన యూరియా	51,275
ఆగస్టు నాటికి సరఫరా	24,991
స్టాక్ (నిల్వ)	1,244
తక్షణ వసరం	6,102
శుక్రవారం వచ్చినది	2,203



జిల్లాకు 6,102 మెట్రి క్ టన్నులు యూరియా అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రస్తుతం 2,203 మెట్రిక్ టన్నులు కర్నూలు, ఆదోనికి చేరింది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఏపీ మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు రేషియో ప్రకారం పంపిణీ చేశాం. యూరియా ఒక్క బస్తా కూడా పక్కదారి పట్టకుండా చర్యలు చేపడుతున్నాం. రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నాం. ఎక్కడైనా యూరియా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం ఇస్తే తక్షణ చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తాం.

\- వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ, కర్నూలు

సేవలతో పీఈటీలు గుర్తింపు తెచ్చుకోవాలి

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీఈటీలు విద్యాసంస్థల్లో క్రీడాకారుల రాణింపు కోసం అదనంగా సేవలందిస్తూ గుర్తింపు తెచ్చుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు క్లబ్ హాలులో ఏర్పాటు చేసిన ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవం ఉంటుందన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి అలవాట్లను బోధించే క్రమంలో పీఈటీల సేవలను కొనియాడారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కేజే రెడ్డి మాట్లాడుతూ క్రీడారంగానికి సేవలందిస్తున్న పీఈటీలను గుర్తించి అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీ తలు విజయభాస్కర్ రెడ్డి, మహబూబ్ సుభాని, విజయ జ్యోతి, పద్మలత, లక్ష్మయ్య, చంద్రశేఖర్, నాగన్న,వెంకట్, ప్రతాప్‌లను అవార్డు అందజేసి మెమెంటో, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, సభ్యులు దాసరి సుదీర్, గుడిపల్లి సురేందర్, గంగాదర్, ఎం.విజయకుమార్, షేక్షా వలి, నాగరత్న మయ్య, చంద్రశేఖర్, కొండెపోగు చిన్న సుంకన్న, వంశీ, నాగ శ్రీనివాసులు, సువర్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శాలివాహన రాష్ట్ర డైరెక్టర్‌ను కలిసిన వెంకటమాధవ్

మద్దికెర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామానికి చెందిన శ్రీవిద్యాసాయి కళాశాల ఎండీ యజ్ఞం వెంకట మాధవ్, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన సుబ్బయ్యను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకట మాధవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సుబ్బయ్యకు రాష్ట్ర డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

9న రైతుల సమస్యలపై ధర్నా

మద్దికెర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై వైఎసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన పత్తికొండలో చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని జడ్పీటీసీ డి.మురళీధర్ రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు మల్లికార్జున యాదవ్, రాష్ట్ర ఇరిగేషన్ మాజీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారని అన్నారు.

జిల్లా ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యం

ఆదోని టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతుందని ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ నాయకత్వంలో వెంకన్న పేటలోని పురపాలక ప్రాథమిక పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులు నాగేంద్రప్ప అధ్యక్షతన జరిగిన ఉపాధ్యాయుల పదవి విరమణ జరిగింది. ఆయన మాట్లాడుతూ అందరూ ఏకమై జిల్లా ఏర్పాటుకు పోరాడాలని కోరారు. సమావేశంలో నరేంద్ర యాదవ్, నాగరాజు, హఫీస్ పాల్గొన్నారు.

దేవుడి వాక్యాన్ని ఆచరణలో పెట్టాలి


ప్రార్థనలో పాల్గొన్న ఉమాపతి నాయుడు

ఆదోని రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏసుప్రభు వాక్యాన్ని ఆచరణలో పెట్టాలని, సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయాలని పాస్టర్ బిషప్ గోరంట్ల జ్ఞానేష్ తెలిపారు. ఆదోని మండలం దొడ్డనగేరిలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు క్రీస్తు భక్తులు పెద్ద ఎత్తున చర్చికు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, దొడ్డనగేరి మాజీ ఎంపీటీసీ శివప్ప, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి


రైతులతో అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న కౌలురైతులందరికీ గుర్తింపుకార్డులిచ్చి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నలకదొడ్డి గ్రామంలో కౌలురైతుల సమస్యలపై అభిప్రాయసేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది కౌలు రైతులు భూమిని కౌలుకు తీసుకుని పంటలను సాగుచేసి తీవ్రంగా నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం కౌలు రైతులను ఆదుకోవడంలో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజా సాహెబ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, గ్రామ నాయకులు రవికుమార్, రంగన్న, సోమలింగప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బిల్లేకల్ మార్కెట్ ప్రారంభం


మార్కెట్‌ను ప్రారంభిస్తున్న వైకుంఠం జ్యోతి

ఆస్పరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లేకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని టమోటా, కూరగాయల మార్కెట్‌ను శుక్రవారం ఆలూరు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి, వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శివప్రసాద్ ప్రారంభించారు.కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేష్, మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, రాఘవేంద్రయాదవ్, సుదర్శన్, రాజశేఖర్ పాల్గొన్నారు.


ఆదోని మునిసిపల్ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఆదోని మిల్టన్ గ్రామర్ పాఠశాలలో...


ఆదోని: పదోన్నతి పొందిన హెచ్‌ఎంలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు


ఆలూరులో...

ఆదోని డివిజన్‌లోని ఆదోని, పత్తికొండ, ఆలూరు, హోళగుంద, దేవనకొండ, హాలహర్వి, ఆస్పరి, మద్దికెర, తుగ్గలి, వెల్దుర్తి మండలాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఆయా పాఠశాలల్లో పూలమాలలు వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల స్థానం ఉన్నతమైనదన్నారు. భావి భారత పౌరుల జీవితాలను తీర్చిదిద్దుతూ, దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావడం నిజంగా గర్వకారణమని అన్నారు.


ఆదోని: డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



తుగ్గలిలో..


మద్దికెర: గురు పూజోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


దేవనకొండలో...


పత్తికొండ: ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకుంటున్న కళ్యాణమ్మ

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు


ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకుంటున్న సునీల్ రాజ్ కుమార్


అలిమ్ సిద్దికి...

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు సునయన ఆడిటోరియంలో శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఆదోని నియోజకవర్గంలోని పలువురు ఉపాధ్యాయులు అందుకున్నారు. జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయులు ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ అవార్డులను ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్ బాషా, డీఈవో చేతుల మీదుగా అందుకున్నారు. నెహ్రూమెమోరియల్ పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు సునీల్ రాజ్‌కుమార్, మునిసిపల్ హై స్కూల్ గణిత ఉపాధ్యాయుడు నిరంజన్ కుమార్, అండర్ పేట ఉర్దూ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలిమ్ సిద్దికి, కపటే జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమ చారి అదే పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గోపాల్, పెద్ద హరివాణం జడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రామన్న దొడ్డనకేరి జెడ్పి పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు హసీనా అవార్డులు అందుకున్నారు.


నిరంజన్ కుమార్..


ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా అవార్డు అందుకుంటున్న రామన్న


కె గోపాల్..

మండలాల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తా - ఎమ్మెల్యే పార్థసారధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారధి

ఆదోని రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లా కోసం... మండలాల సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. శుక్రవారం రాత్రి పెద్ద హరివాణం మండల సాధన సమితి ఆధ్వర్యంలో గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ ఆదోని ప్రత్యేక జిల్లా కావాలని, పెద్దహరివాణంతోపాటు మరో మూడు మండలాలుగా ఆదోని మండలాన్ని విభజించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదోని అభివృద్ధి కోసం ఇప్పటికైనా పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, గ్రామ సర్పంచ్ రాముడు, కూటమి నాయకులు మల్లప్ప, శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మి సలీం, గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే


దేవకుంట సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని జొన్నగిరి గ్రామ శివారులో ఉన్న అశోకుని శిలాశాసనాలకు వెళ్లే రహదారిని రూ.90లక్షలతో సీసీ రోడ్డు వేశారు. ఆ రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అన్నీ మజరా గ్రామాలకు బీటీ, సీసీ రోడ్లు వేశామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను కూడా నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి, తిరుపాల్‌నాయుడు, వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్, మిద్దె వెంకటేశ్ యాదవ్, రవి, బాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● అశోకుని శిలాశాసనాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం జి.ఎర్రగుడి, జొన్నగిరి గ్రామాల మధ్య అశోకుని శిలాశాసనాలను సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే అశోకుని ధర్మ నియమాలు పాటించాలని వేసిన శిలాశాసనాలను ఆర్కియాలజి డిపార్టుమెంటు వారు ఎంతో కష్టపడి రక్షిస్తున్నారని, అశోకుని శిలాశాసనాల ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ సలహా మండలి సభ్యులు వెంకటపతి, టీడీపీ నాయకులు బసన్న, బాలన్న, చంద్రశేఖర్ యాదవ్, నాగరాజు, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

పత్తికొండ: గ్రామీణప్రాంతాల అభివృద్ధి టీడీపీప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ మండలం చందోలి మజరా గ్రామం దేవకుంట గ్రామానికి ఏర్పాటు చేసి సీసీ రహదారిని ఆయన శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, వెంటకపతి, తిరుపాల్, లోక్‌నాథ్, శ్రీనివాసులుగౌడ్, చందోలిరంగప్ప, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కురువ శశికళ



ఆలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆలూరుకు చెందిన కురువ శశికళను నియమిస్తూ వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లా వైసీపీ మహిళా అధ్యక్షురాలిగా చేస్తున్న సేవలను గుర్తించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర కార్యవర్గంలో ప్రాధాన్యత కల్పించారన్నారు. నాపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుద కళ్యాణి, రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి సతీష్, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, జిల్లా అధ్యక్షులు ఎస్.వి.మోహన్‌రెడ్డి, విజయ మనోహరిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధ్యాయ సంఘాలను కించ పరచలేదు'

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల నాయకులను కించపరిచేలా మాట్లాడలేదని ఎంఈవో రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులను అగౌరవపరిచేలా ఎప్పుడు మాట్లాడలేదని, ఉపాధ్యాయులను గౌరవించేలా ఉంటానని తెలిపారు.

ఇండియా టాప్-2గా నిలిచిన కెనరా బ్యాంకు ఉద్యోగి


నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని కెనరా బ్యాంకులో పనిచేస్తున్న బి.నాగరాజు అనే ఉద్యోగి తన ప్రతిభను కనబరిచి ఇండియా టాప్-2గా నిలిచాడు. బ్యాంకులో వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంలో ప్రతిభ కనబరిచి దేశంలోనే పాన్ ఇండియా 2 వ్యక్తిగా నిలిచారు. ఈ మేరకు కర్నూలు ప్రధాన కెనరా బ్యాంకులో వార్డుగ్రహీత నాగరాజుకు కర్నూలు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ ఘనంగా సన్మానించి, రూ.10 వేలు అవార్డును అందజేశారు. నాగరాజును ఆదోని చీఫ్ మేనేజర్ రాజేష్‌మోహన్, మేనేజర్ సురేంద్రబాబు సన్మానించి అభినందించారు.

ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు మునిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గంలోని పెద్దహోతూరు, మాచాపురం గ్రామాల్లో ఉల్లి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటానికి రూ.3 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వమే రైతుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. రైతుల సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకోవాలన్నారు.

యూరియా వచ్చేసింది..!

5వ పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా యూరియాలో 70 శాతం వరకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ఇస్తుంది. అక్కడి నుంచి గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘాలు (పీఏసీఎస్)కు సరఫరా చేస్తుంది. సొసైటీలకు ఇస్తున్న యూరియా మెజార్టీగా రాజకీయ పలుకుబడి కలిగిన బడా రైతుల ఇళ్లకే చేరుతుండడంతో సామాన్య రైతులకు అందని ద్రాక్షగా మారింది. దీనికి తోడు గ్రామ రాజకీయాలు కూడా యూరియా సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. సొసైటీల్లో యూరియా లభించని రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. డీలర్లకు 30-40 శాతానికి మించి యూరియా ఇవ్వడం లేదు. దీనికి తోడు యూరియా కావాలంటే బయో ఎరువులు కొనాలని లింక్ పెడుతుండటం, కొందరు వ్యాపారులు ధనాపేక్షతో యూరియా కృత్రిమ కొరత సృష్టించడంతో రైతులు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిని పసిగట్టిన కూటమి ప్రభుత్వం విజిలెన్స్ నిఘా పెట్టడంతో యూరియా వ్యథలు రైతులకు తప్పాయని అంటున్నారు. ముఖ్యంగా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్ సొసైటీలకు సరఫరా చేస్తున్న యూరియా రైతుకు ఎంత సరఫరా చేశారో పక్కాగా నిఘా పెడితే యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఉండదు.

2025-26లో ఖరీఫ్ సీజన్‌లో యూరియా ఇలా

వివరాలు	మెట్రిక్ టన్నులు
కావాల్సిన యూరియా	51,275
ఆగస్టు నాటికి సరఫరా	24,991
స్టాక్ (నిల్వ)	1,244
తక్షణ వసరం	6,102
శుక్రవారం వచ్చినది	2,203



2,299 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది



జిల్లాకు 6,102 మెట్రి క్ టన్నులు యూరియా అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రస్తుతం 2,203 మెట్రిక్ టన్నులు కర్నూలు, ఆదోనికి చేరింది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఏపీ మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు రేషియో ప్రకారం పంపిణీ చేశాం. యూరియా ఒక్క బస్తా కూడా పక్కదారి పట్టకుండా చర్యలు చేపడుతున్నాం. రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నాం. ఎక్కడైనా యూరియా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం ఇస్తే తక్షణ చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తాం.

- వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ, కర్నూలు


పత్తికొండలో ర్యాలీ...


మద్దికెరలో...

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

జిల్లాలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లింలు శుక్రవారం రాత్రి జామియా మసీదులో ప్రార్థనలు చేసి ర్యాలీ చేపట్టారు. జెండాలు చేతపట్టి బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ప్రవక్త తలనీలాలను దర్శించుకున్న టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు


వెల్దుర్తిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఉచ్చీరప్పతాతకు విశేష పూజలు

ఆలూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో వెలిసిన ఉచ్చీరప్పతాత దేవాలయంలో అఖండ సప్తభజనలో భాగంగా శుక్రవారం సాయంత్రం కమ్మ సంఘం ఆధ్వర్యంలో భారీ పుష్ప, ఆపిల్ గజమాలలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి అలంకరణ చేశారు. ఉదయం దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలను పీఠాధిపతి చంద్రమౌళిస్వామి, అర్చకులు సిద్ధయ్య చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకి ఉత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు అర్చకులు సిద్ధయ్యస్వామి తెలిపారు. ఆలయంలో చేపట్టిన అఖండ సప్తభజన శనివారం ఉదయం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

చౌడేశ్వరీదేవికి పూజలు



మద్దికెర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొండమ్మ బావి ప్రాంతంలో వెలసిన చౌడేశ్వరి దేవి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని మద్దికెర గ్రామంలో చౌడేశ్వరి దేవి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పెద్దకోట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయాలు మూసివేత

మద్దికెర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో వెలసిన ఎంతో ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం, మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథ స్వామి దేవాలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం రావడంతో ఆలయాలను మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో వీరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చంద్రగ్రహణం రావడం వల్ల ఆలయాలను మూసి వేస్తున్నామనీ 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు మూసివేసి సోమవారం 8వ తేదీన ఉదయం 7 గంటలకు ఆలయాలను తెరిచి సంప్రోక్షణ, శుభ్రం చేసి యథావిధిగా పూజలు చేసి భక్తులకు స్వామివార్ల దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు గమనించాలన్నారు.

పడకేసిన పారిశుధ్యం

● ఎమ్మిగనూరులోని మైనార్టీ కాలనీలో కనీస సౌకర్యాలు లేక ప్రజల అవస్థలు ● తాగునీటికి కటకట ● పట్టించుకోని పాలకులు,అధికారులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు కాలనీలు ఏర్పడి ఏళ్ళు గడుస్తున్నప్పటికి సమస్యలు పీడిస్తున్నాయి. పట్టణానికి శివారులో ఉండడంతో మైనార్టీ కాలనీ అభివృద్ధికి నోచుకోకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నివాస గృహాలకు, జనాభాకు సరిపడా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దీంతో కాలనీ వాసులకు కష్టాలు తప్పడం లేదు. అప్పుడు తేలుగుదేశం ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి బీ వి మోహన్‌రెడ్డి నిరుపేదలైన మైనార్టీలకు స్థలాలు కేటాయించారు. అప్పట్లో పట్టణానికి శివారు ప్రాంతం కావడంతో ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకొలేకపోయారు. ప్రస్తుతం 15 సంవత్సరాలుగా ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకొని దాదాపు కొన్ని వందల కుటుంబాలు కాలనీలో నివసిస్తునప్పటికీ వారికి కాలనీ మొత్తానికి ఒకే ఒక ప్రధాన సీసీ రోడ్డు మాత్రమే ఉంది. అది కూడా కేజీవీబీ పాఠశాల, హాస్టళ్ళు కోసం ఏర్పాటు చేసింది. ఆ తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవు. కాలనీలో అనేక వీధులు మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి, ఎక్కడా సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో కాలనీలోని వీధులన్ని గుంతలమయంగా మారిపోయాయి, వర్షం వచ్చిందంటే కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి, ఇళ్ళలోకి వెళ్ళాలంటే బురద అంటించుకోనిదే ఇళ్ళకు చేరుకోలేని దుస్థితి. కాలనీవాసులు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ళు గడుస్తున్నప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. పన్నులు మాత్రం మునిసిపాలిటి అధికారులు ముక్కుపిండి వసూలు చేస్తున్నప్పటికీ ఆ స్థాయిలో కాలనీ వాసులకు మౌలిక వసతులు కల్పించడం, కాలనీల అభివృద్ధి కోసం చర్యలు తీసుకున్న ధాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో మాత్రం రాజకీయనాయకులు శివారు కాలనీలకు పెద్దపీట వేస్తామని, శివారు కాలనీలలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని గొప్పలు చెపుకోవడం తప్ప ఫలితం శూన్యం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 5 ఏళ్ళు ఏ మాత్రం పట్టించుకొలేదు. దీంతో కాలనీలు ఏ మాత్రం అభివృద్ధికి నోచుకొలేదు. కనీసం కూటమి ప్రభుత్వం అయినా కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటారని కాలనీవాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది


కాలనీలో ఇంటి ముందు నిలిచిపోయిన వర్షపు నీరు


రోడ్డుపై దారి లేకుండా నిలిచిపోయిన వర్షపు నీరు

వసతులు కల్పించాలి



మైనార్టి కాలనీకి బీవీ మోహన్‌రెడ్డి మాకు గత 30 సంవత్సరాల కింద పట్టాలు ఇచ్చారు.నేను దాదాపు 10సంవత్సరాల నుండి ఇక్కడే నివాసం ఉంటున్నాను. ఇక్కడ మాకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక రాక పోకలు సాగించాలంటే చాలా ఇబ్బందికరగా ఉంది. మాకు మౌలిక వసతులు కల్పిసే బాగుంటుంది అన్నారు. వర్షం వచ్చిందంటే పెద్ద పెద్ద విష సర్పాలు ఇళ్లలోకి వచ్చాయి, ముగ్గురు పాము కాటుకు మృతి చెందారన్నారు.

- సద్దాం

విషజ్వరాలతో జీవనం సాగిస్తున్నాం



గత 7సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నాము. మాకు ఇక్కడ సీసీ రోడ్లు లేక వర్షాలు పడితే నడిచే పరిస్థితి కూడా ఉండదు,మోకాళ్ళ లోతు బురద నీరు ఉంటుంది,డ్రైనేజిల సౌకర్యం కూడా లేక ఇంటి ముందు మురుగు నీరు నిల్వ ఉండడం వలన పిల్లలకు విష జ్వరాలతో జీవనం సాగిస్తున్నామన్నారు..ఎండాకాలం వచ్చిందటే నీటి కష్టాలు మొదలవుతాయి అని అన్నారు.

- అబ్దుల్లా

మదర్ థెరిస్సాకు ఘన నివాళి


పూలమాలలు వేస్తున్న జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు మదర్‌థెరిస్సా 28వ వర్ధంతికి నివాళులు అర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బుజ్జిబాబు మాట్లాడుతూ ప్రపంచ నలుమూలల మిషనరీలు స్థాపించి సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. 'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతుల మిన్నా' అంటూ దాన్ని కార్యచరణలో చూపిందన్నారు. శాంతి రాజు, భాస్కర్, తాయన్న పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నందవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం నందవరంలో సీఐటీయూ నాయకులతో ప్రత్యేక సమావేశం తాలుకా అధ్యక్షుడు రాముడు, ఏపీ సమగ్ర శిక్ష అబియాన్ యూనియన్ నాయకుడు ఉరుకుంద ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రస్తుతం మార్కెట్ ధరలకు అనుకూలంగానే వేతనాలు పెంచాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించే ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణను ఉప సంహరించుకోవాలన్నారు. ఈ నెల 13న నిర్వహించే అంగన్‌వాడి జిల్లా మహసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి మహిళా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి'

కౌతాళం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అసభ్య పదజాలంతో చిందులేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు నిధులు మంజూరు చేసిన విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినపుడు ప్రధానోపాధ్యాయుడు చాలా దురుసుగా ప్రవర్తించారాని తనకు నాయకులు, అధికారులు తెలుసు అంటూ దుర్భాషలాడాడని శుక్రవారం వెంకటేష్ విలేకరుల సమావేశంలో తెలిపాడు. విషయంపై మండల విద్యాధికారిణి శోభారాణి దృష్టికి తీసుకుపోగా నాకు ఇప్పుడే తెలిసిందని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడిని పిలిపించి విచారిస్తానని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మంత్రాలయం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా అన్ని విధాలా అండగా ఉంటామని టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చౌలహల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అంజినేయ బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న రఘునాథరెడ్డి ఆయనను పరామర్శించారు. పార్టీ కోసం పని చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివరాముడు, రమేష్, అంజి, అంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీ సేవా వర్క్‌షాప్‌లో దయాసాగర్


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో దయాసాగర్

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన బీజేపీ సేవా వార్షికోత్సవ వర్క్‌షాప్‌లో ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిలర్, బీజేపీ జిల్లా కార్యాదర్శి వీజేపీ దయాసాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మధుకర్‌జిని, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవన్ కలిశారు. కర్నూలు జిల్లాలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించినట్లు దయాసాగర్ తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో

మంత్రాలయం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో సూగూరు క్రాస్ వద్ద ఆటో ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో ప్రమాదం తృటిలో తప్పింది. మంత్రాలయం నుంచి మాధవరం వస్తున్న ఆటో పశువులను తప్పించబోయి కింద ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆటో ముందు బాగం పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్ సురక్షితంగా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆటోలో ప్రమాదం తృటిలో తప్పింది. ఆటోను క్రేన్ సాయంతో బయటకు తీశారు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


మక్కా మదీనా ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం


వేడుకల్లో బల ప్రదర్శన చేస్తున్న యువకులు

కోసిగి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం కోసిగి ప్రధాన రోడ్డు వద్ద గ్రామ పురవీదుల గుండా జెండాలతో ముస్లీంలు ర్యాలీ చేపట్టారు.మసీదులను విద్యుద్దీపాలు, జెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గోకార్‌సాబ్ జెండా వద్ద జెండాను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ హనుమంతరెడ్డి గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మంత్రాలయం: మంత్రాలయంలో జామియ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింల ఆరాధ్య దైవం మహమ్మద్ ప్రవక్త జన్మదిన (మిలాద్ ఉన్ నబీ) వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామునుంచే ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మాధవరం , రాంపురం, తుంగభద్ర, వగరూరు, మాలపల్లి గ్రామాల్లో రాత్రి మక్కా, మదీన, తల్వార్ నమూనాలను ఊరేగించారు. మంత్రాలయంలో ప్రత్యేక వాహనంపై జామియ మసీదు నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ఈద్గా వరకు వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఇమాం ఖాజా బందెన్‌వాజ్, ఖాజాహుస్సేన్, నూర్ అహమ్మద్, రఫీ, సాబువలి, పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్ల తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం మహుమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు (మిలాద్‌ఉన్ నబి) వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల మసీదు ల దగ్గర ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు జరుపుకొని గ్రామంలో పురవీధుల గుండా ప్రవక్త కు చెందిన భక్తి గీతాలను అలపిస్తూ ప్రవక్తకు గుర్తుగా జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దరగలమాబు, దరగల కాజా, రహీంబాషా, షఫి బాషా, ఉసేని, పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని ముగతి, నందవరం, నదికైరవాడి, నాగలదిన్నె, హలహర్వి, మాచాపురం తదితర గ్రామాల్లో మిలాద్ ఉన్ నబి వేడుకలు భక్తి శ్రద్దలతో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మసీదు దగ్గర ప్రార్థనలు చేసుకుని అక్కడ నుంచి పూర వీధుల గుండా ఊరేగింపుగా వెళుతూ' నారే తక్బీర్ అల్లాహు అక్బర్ అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మస్లీంలు, యవకులు పాల్గొన్నారు.

కౌతాళం: గ్రామంలోని ముల్లార్ వీధిలో ఉన్న మసీదు నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు మక్కా మసీదు నమూనాతో ట్రాక్టర్ ర్యాలీ చేపట్టారు. శ్రీ జగద్గురు ఖాదర్ లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ చిన్న మున్నా పాషా ఆధ్వర్యంలో జండాలను పట్టుకుని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త బోధించిన విషయాలను తప్పక పాటించాలని సూచించారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త జన్మదిన(మిలాద్ ఉన్ నబి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు.

పెద్దకడబూరు: మండల కేంద్రమైన పెద్దకడబూరుతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని తెలియజేస్తూ ర్యాలీలు నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల్లోని వీధుల్లో జెండాలను కట్టి వేడుకలు జరుపుకున్నారు. ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండ ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎమ్మిగనూరు టౌన్ : పట్టణంలో ముస్లిం సోదరులు మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని అయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం పెద్దలు, యువకులు, జామియా మసీదు మౌలానా మహబూబ్ జిలాని సాబ్, మౌలానా ఫైరుల్లసాబ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు


నరసింహరాజుకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్, ఎంపీ


నాగేంద్ర కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎంపీ

మంత్రాలయం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహరాజు, మాధవరం ప్రాథమిక పాఠశాల మెయిన్ హెచ్‌ఎం రామమోహన్‌కు, మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న మల్లన్న (మంత్రాలయం ఉన్నత పాఠశాల పీఈటీ నరసింహరాజు, ఉత్తమ అవార్డులు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డీఈవో శామ్యూల్ పాల్ ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు

నందవరం: మండల పరిదిలోని కనకవీడు గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నాగేంద్ర కుమార్ ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక కావడంతో శుక్రవారం కర్నూలులో కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు చేతుల మీదగా సన్మానం చేసి అవార్డును అందజేశారు. ఉత్తమ అవార్డుగా ఎషికైన ఆయనకు పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు కరుణానిది మూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ధనుంజయ్, రాజు, శంకరప్ప అభినందనలు తెలిపారు.

యూరియా వచ్చేసింది..!

5వ పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా యూరియాలో 70 శాతం వరకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ఇస్తుంది. అక్కడి నుంచి గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘాలు (పీఏసీఎస్)కు సరఫరా చేస్తుంది. సొసైటీలకు ఇస్తున్న యూరియా మెజార్టీగా రాజకీయ పలుకుబడి కలిగిన బడా రైతుల ఇళ్లకే చేరుతుండడంతో సామాన్య రైతులకు అందని ద్రాక్షగా మారింది. దీనికి తోడు గ్రామ రాజకీయాలు కూడా యూరియా సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. సొసైటీల్లో యూరియా లభించని రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. డీలర్లకు 30-40 శాతానికి మించి యూరియా ఇవ్వడం లేదు. దీనికి తోడు యూరియా కావాలంటే బయో ఎరువులు కొనాలని లింక్ పెడుతుండటం, కొందరు వ్యాపారులు ధనాపేక్షతో యూరియా కృత్రిమ కొరత సృష్టించడంతో రైతులు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిని పసిగట్టిన కూటమి ప్రభుత్వం విజిలెన్స్ నిఘా పెట్టడంతో యూరియా వ్యథలు రైతులకు తప్పాయని అంటున్నారు. ముఖ్యంగా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్ సొసైటీలకు సరఫరా చేస్తున్న యూరియా రైతుకు ఎంత సరఫరా చేశారో పక్కాగా నిఘా పెడితే యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఉండదు.

2025-26లో ఖరీఫ్ సీజన్‌లో యూరియా ఇలా

వివరాలు	మెట్రిక్ టన్నులు
కావాల్సిన యూరియా	51,275
ఆగస్టు నాటికి సరఫరా	24,991
స్టాక్ (నిల్వ)	1,244
తక్షణ వసరం	6,102
శుక్రవారం వచ్చినది	2,203



2,299 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది



జిల్లాకు 6,102 మెట్రి క్ టన్నులు యూరియా అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రస్తుతం 2,203 మెట్రిక్ టన్నులు కర్నూలు, ఆదోనికి చేరింది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఏపీ మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు రేషియో ప్రకారం పంపిణీ చేశాం. యూరియా ఒక్క బస్తా కూడా పక్కదారి పట్టకుండా చర్యలు చేపడుతున్నాం. రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నాం. ఎక్కడైనా యూరియా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం ఇస్తే తక్షణ చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తాం.

- వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ, కర్నూలు

సమస్యల్లో చదువుల రామయ్య కాలనీ


సీసీ రోడ్డు, డ్రైనేజీ లేని కాలనీ వీధులు


గుంతలు పడ్డ మట్టి రోడ్డును చూపుతున్న కాలనీవాసులు

గోనెగండ్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని మేజర్ పంచాయతీలో ఉన్న చదువుల రామయ్య కాలనీలో 35 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. చదువుల రామయ్య కాలనీ సమస్యలు పట్టించుకున్న నాయకులు, అధికారులే లేరని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. 35 ఏళ్ల క్రితం కమ్యూనిస్టు నాయకులతో కలసి పోరాటం చేస్తే ప్రభుత్వం 100 గృహాలకు పట్టాలు ఇచ్చిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రతి ఇంటి నుంచి పంచాయతీకి ఇండ్ల గుత్తలు కడుతున్నామన్నారు. ఓట్ల కోసం వచ్చిన ప్రతి నాయకుడిని సమస్యలు పరిష్కరించమని కాలనీ వాసులు వేడుకుంటున్నప్పటికీ ఏ నాయకుడు కాలనీ బాగోగులు పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎభుత్వం చేపడుతున్న పల్లెపండుగ కార్యక్రమంలో అయినా తమ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి కొళాయిలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1990 నుంచి ఇప్పటి వరకు చదువులరామయ్య కాలనీలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీ పెద్దలు చెన్నలరాయుడు, సూరి, అంజి, రామక్క, ఈరన్నతో పాటు కాలనీ వాసులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలి



గత 35 ఏళ్లుగా మా కాలనీని ఏ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. సీసీ రోడ్డు, డ్రైనేజీలు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెపండుగ కార్యక్రమంలోనైనా మా కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు చేపడితే బాగుంటుంది. అధికారులు, నాయకులు స్పందించాలి.

చెన్నలరాయుడు, చదవులరామయ్య కాలనీ, గోనెగండ్ల.